# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 147 | విశాఖపట్నం | 27-2-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 147 | VISAKHAPATNAM | 27-2-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## పోలవరం - నల్లమల సాగర్‌తో
# తెలుగు రాష్ట్రాలకు లాభం: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గోదావరి నుంచి సముద్రంలోకి వెళ్లే వృథాగా వరద జలాలను.. ఆయా ప్రాజెక్ట్‌లకు తరలిస్తామని పేర్కొన్నారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, దీనికి తాము అభ్యంతరం చెప్పలేదని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ దీని వల్ల లాభం కలుగుతుందని ఉద్ఘాటించారు. పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకి పొరుగు రాష్ట్రం అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. సాగునీటి రంగంపై శాసనసభలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. 2047 విజన్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రధానంగా నీటి భద్రతపైనే దృష్టి సారించిందని సీఎం వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించే బాధ్యత తమ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి ఇవ్వడం ద్వారా జలాలను అత్యంత విలువైన వనరుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి నది నుంచి సగటున ఏడాదికి 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని వివరించారు. వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలో నదులను అనుసంధానిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గంగా-కావేరీ అనుసంధానం జరగాలన్నది తన ప్రగాఢమైన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. గంగా - కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయని ప్రస్తావించారు. నదులు అనుసంధానం చేసి, తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా 738 కిలోమీటర్ల మేర కాలువలను విస్తరించి కుప్పంలో పరమ సముద్రం చెరువు వరకూ నీరిచ్చామని వివరించారు. మడకశిర వరకూ నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంత దాహార్తిని తీర్చామన్నారు. ఏపీలో



కట్టిన ప్రాజెక్టులన్నీ టీడీపీ, కూటమి హయాంలో వచ్చినవేనని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ కట్టిన కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుంచుకుంటున్నామని చెప్పారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు చేపట్టినట్లు ప్రస్తావించారు. సాగునీటిపై 2014 నుంచి 2019లో రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. గడిచిన 20 నెలలుగా రూ.20 వేల కోట్ల వరకూ ఖర్చు చేయగలిగామని వివరించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకూ నీరిచ్చి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేసి 100 టీఎంసీలను రాయలసీమకు తరలించామని వెల్లడించారు. అందుకే ఆ ప్రాంతం రతనాల సీమగా (తరువాయి 2వ పేజీలో)



2లో

### అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి: ఏపీ హైకోర్టు



4లో

### చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి: పార్థసారథి



6లో

### మానసిక సమస్యలకు సమర్థమైన సైకోథెరపీ చికిత్స

## గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్పు..
# ఇకపై స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనసభలో గ్రామ, వార్డు సచివాలయాల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా పిలుస్తారు. గురువారం మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో పనిచేస్తోందని, ఈ విజన్‌కు అనుగుణంగా సచివాలయాల విధుల్లో మార్పులు చేశామని మంత్రి వివరించారు. అందుకు తగినట్లుగా సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మారుస్తూ చట్ట సవరణను ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనిపై ఈ ఏడాది జనవరిలో గవర్నర్ గెజిట్ ద్వారా ఆర్డినెన్స్ జారీ చేశారన్నారు మంత్రి. సచివాలయాలు చాలా చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, ప్రభుత్వ భవనాలున్న (తరువాయి 2వ పేజీలో)



### ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ ప్రపంచ రికార్డు.. 10 కోట్ల ఫాలోవర్లు

7లో

# అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం: అనగాని



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను సౌర విద్యుత్ సంస్థలకు లీజుకు ఇచ్చేలా చట్టసవరణ చేశామని.. హరిత ఇంధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కర్బన ఉద్గారాలు సున్నాకు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. గతంలో ఇలాంటి ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు తీసుకోవడం సాధ్యమయ్యేది కాదని, చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములు లీజుకు ఇచ్చే వెసులుబాటు (తరువాయి 2వ పేజీలో)

### సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు ఏవి?



5లో



### శ్రీవారి హుండీలో ఇక డిజిటల్ మొక్కులు.. 'ముడుపు పత్రం' విధానానికి టీటీడీ శ్రీకారం

2లో


పతాకం న్యూస్ — APTEL/25/A2082 — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## పిలుపు

ప్రపంచ దేశాలన్నింటినీ దోచుకుంటూ, పెత్తనం సాగిస్తున్న అమెరికాకు వ్యతిరేకంగా టారిఫ్ బాధిత దేశాలన్నీ ఐక్యంగా పోరాడాలన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా పిలుపు అత్యంత సముచితం. ఐదు రోజుల భారత్ పర్యటనలో వాణిజ్యం రెట్టింపు చేసుకోవాలని బ్రెజిల్, భారత్ నిర్ణయించడం శుభ పరిణామం. ఎఐ సదస్సుకు హాజరైన ఆయనతో ఖనిజాలు, ఉక్కు, మైనింగ్, డిజిటల్ సహకారం, వాణిజ్యం, ప్రాదేశిక సార్వభౌమాధికారం, రేర్ ఎర్త్, శిలాజ ఇంధనాలు తదితర అంశాలకు సంబంధించి మనదేశం పలు ఒప్పందాలు చేసుకుంది. ఈ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు మనదేశంతోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరించాల్సిన పాత్రకు సంబంధించి ఒక సందేశాన్ని పంపాయి. బలవంతుడైన యజమానితో కార్మికులంతా ఐక్యమై చర్చలు జరిపితే విజయం సాధించడం సులభం. అగ్రరాజ్యం అమెరికా పట్ల కూడా అదే వైఖరి అనుసరించాలని కార్మిక నేతగా, బ్రెజిల్ అధ్యక్షుడిగా ఆయన చేసిన సూచన భారత్ సహా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటికీ ఉపయోగకరం. గ్రేట్ ఫ్రెండ్, గుడ్ ఫ్రెండ్, శాంతి దూత... ట్రంప్ నాయకత్వంలో శాంతి, సంపద, స్థిరత్వం సాధ్యమవుతుందంటూ పొగడ్తలు కురిపించే, ట్వీట్లు చేసే ప్రధాని మోడీ ఇకనైనా లొంగుబాటు ధోరణికి స్వస్తి పలకడం భారత్ ప్రయోజనాలకు అత్యవసరం. అమెరికా అత్యధికంగా 50 శాతం సుంకాలను బ్రెజిల్‌తోపాటు మనదేశంపై విధించింది. దీనిపై ఇరు దేశాలు స్పందించిన తీరు భిన్నంగా ఉంది. అమెరికా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నందున వేచి చూసే ధోరణిని భారత్ మినహా బ్రిక్స్ దేశాలన్నీ అనుసరించాయి. 1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఇఇపిఎ) కింద గత ఏడాది ఏప్రిల్ నుంచి సుంకాలు విధిస్తున్న ట్రంప్ చర్యలు చెల్లబోవని అమెరికా సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పు ఇవ్వడం ప్రపంచానికి ఊరటనిచ్చింది. ఈ తీర్పును వమ్ము చేయాలనే ఉద్దేశంతో ట్రంప్ అన్ని దేశాలపై సెక్షన్ 122 కింద 15 శాతం అదనపు సుంకాలు విధించారు. ఈ తీర్పు వచ్చే వరకూ వేచివుండకుండా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడం మన దేశ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోంది. అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తే మనదేశంలో సుంకాలేవీ లేకుండానే అమెరికా సరుకులు విక్రయించేలా గేట్లు బార్లా తెరిచేందుకు మోడీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం అవమానకరం. అమెరికన్ ఉత్పత్తులపై 30 నుంచి 35 శాతం విధిస్తున్న సుంకాలను వెనక్కి తీసుకుంది. 3 నుంచి 5 శాతం సుంకం పరిధిలోని భారత ఉత్పత్తులకు 18 శాతం సుంకం విధించేందుకు అమెరికాతో ఒప్పందం చేసుకుని, ఇదే అతి పెద్ద విజయంగా కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. జీరో శాతం సుంకాల వల్ల వ్యవసాయరంగం, డెయిరీపై ఆధారపడిన మనదేశ రైతులు రోడ్డున పడతారు. ఓ రెండు వారాలు ఆగివుంటే అవమానకరంగా అమెరికా షరతులను అంగీకరించే పని లేకుండానే 15 శాతం సుంకాలతో ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశం ఉండేది. యుఎస్ఎ సుప్రీంకోర్టు తీర్పును పరిశీలిస్తున్నామని మనదేశంతోపాటు ఒప్పందాలు చేసుకున్న అనేక దేశాలు ప్రకటించాయి. ఆటలాడొద్దు అంటూ ట్రంప్ తాజాగా ప్రపంచ దేశాలనుద్దేశించి అవమానకరంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. 27 దేశాల యూరోపియన్ యూనియన్ ఐక్యంగా ట్రంప్ ఏకపక్ష టారిఫ్‌లను ఎదుర్కొన్న తీరు కూడా మోడీ నేతృత్వంలోని ప్రభుత్వంలో మార్పు తేలేకపోవడం సిగ్గుచేటు. స్వాతంత్ర్యానంతరం స్వతంత్రంగా అలీన విధానాన్ని తీసుకుని వందకు పైగా దేశాలకు భారత్ నాయకత్వం వహించింది. ఆ వారసత్వాన్ని నిలబెట్టుకోకుండా అమెరికాకు సాగిలపడటం వల్ల ఎటువంటి మినహాయింపులు పొందలేకపోతున్నది. అన్నదాతలకు, పశు పాలకులకు ఎటువంటి నష్టం కలగనివ్వబోమని పార్లమెంట్‌లో గంభీర ఉపన్యాసం ఇచ్చిన మోడీ ఆ మాటను నిలబెట్టుకోవడం అత్యవసరం. అమెరికా ముందు సాగిలపడి చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని, కొత్తగా ఒప్పందం చేసుకోవాలి. అందుకు చర్యలు తీసుకునేలా కేంద్రం మెడలు వంచేందుకు ప్రజలంతా సమాయత్తం కావాలి.

## శ్రీవారి హుండీలో ఇక డిజిటల్ మొక్కులు.. 'ముడుపు పత్రం' విధానానికి టీటీడీ శ్రీకారం



**తిరుమల, పతాకం న్యూస్:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు టీటీడీ ఒక శుభవార్త చెప్పింది. హుండీలో కానుకలు సమర్పించేందుకు నగదు లేదా చిల్లర అందుబాటులో లేని ఇబ్బందులకు చెక్ పెడుతూ 'శ్రీవారి ముడుపు పత్రం' పేరుతో ఒక వినూత్న విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. డిజిటల్ చెల్లింపులు పెరిగిన ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విధానంలో భాగంగా, తిరుపతి, తిరుమలలోని కీలక ప్రాంతాల్లో టీటీడీ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తుంది. భక్తులు ఈ కౌంటర్ల వద్ద తమ స్తోమతను బట్టి రూ.100 నుంచి రూ.లక్ష వరకు యూపీఐ (ఫోన్‌పే, జీపే), క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చు. చెల్లింపు పూర్తయిన తర్వాత, భక్తులకు ఒక 'ముడుపు పత్రం' అందజేస్తారు. ఈ పత్రాన్ని భక్తులు గర్భాలయం వెలుపల ఉన్న శ్రీవారి హుండీలో వేసి తమ మొక్కును చెల్లించుకోవచ్చు. వాస్తవానికి భక్తులు డిజిటల్ రూపంలో చెల్లించినప్పుడే ఆ మొత్తం టీటీడీ ఖాతాకు జమవుతుంది. అయితే, తమ చేతులతోనే హుండీలో కానుకలు సమర్పించాలనే భక్తుల విశ్వాసాన్ని, మనోభావాలను గౌరవిస్తూ టీటీడీ ఈ 'ముడుపు పత్రం' విధానాన్ని ప్రవేశపెడుతోంది. 2025లో శ్రీవారి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో రూ.1,383 కోట్లుగా నమోదైంది. ఈ కొత్త విధానం ద్వారా ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 28న జరిగే టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించి అధికారికంగా ఆమోదముద్ర వేయనున్నారు.

## బీహార్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై అరెస్ట్ వారెంట్



**అమరావతి, పతాకం న్యూస్:** బీహార్‌కి చెందిన ఐపిఎస్ అధికారి సునీల్ నాయక్‌పై గుంటూరు మొబైల్ గురువారం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఎపి శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వై.ఎస్.జగన్ ప్రభుత్వ హయాంలో సిఐడి కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ ఆయనపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ కోసం గుంటూరు పోలీసులు ఇచ్చిన నోటీసులపై సునీల్ నాయక్ స్పందించడం లేద. దీంతో ఆయనను అరెస్టు చేసేందుకు ఇటీవల ఎస్పీ దామోదర్ బృందం పాట్నాకు వెళ్లింది. అయితే ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసేందుకు అక్కడి హైకోర్టు నిరాకరించింది. పోలీసులు సునీల్ నాయక్‌కు అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని గుంటూరు మొబైల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో నేడు గుంటూరు మొబైల్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.

## అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి: ఏపీ హైకోర్టు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనధికారిక కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హైకోర్టులో చుక్కెదురైంది. గతంలో మున్సిపల్ శాఖ జారీ చేసిన జీవో నంబర్ 225ను సవాలు చేస్తూ దాఖలైన పిల్ పై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎలాంటి దరఖాస్తులను పరిశీలించవద్దని అధికారులకు స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసును ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. ప్రకాశం జిల్లాకు చెందిన హరికృష్ణ అనే వ్యక్తి ఏపీ పురపాలక చట్టం సవరణలను సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పదేపదే అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం వల్ల చట్ట ఉల్లంఘన జరుగుతుందని పేర్కొన్నారు. గతంలోనే కౌంటర్ దాఖలు చేయాలని కోరినప్పటికీ, ప్రభుత్వం జాప్యం చేయడంతో హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రస్తుతానికి ఈ ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**నంద్యాల, పతాకం న్యూస్:** పెట్టుబడులు పెరగడం, వరుసగా మూడేళ్లపాటు పంట దిగుబడి రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఓ యువ రైతు ప్రాణాలు తీసుకున్న ఘటన ప్యాపిలి మండలం జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాధవరం గ్రామానికి చెందిన దర్శినేని నాగకృష్ణ (36), తండ్రి నాగచంద్ర, తనకున్న రెండు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, గత మూడేళ్లుగా ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో, వ్యవసాయ అవసరాల కోసం చేసిన అప్పులు సుమారు 10 లక్షల రూపాయలకు చేరాయి. చేసిన అప్పులు తీరే మార్గం కనిపించక, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగకృష్ణ, గురువారం తెల్లవారుజామున తన నివాసంలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు నాగకృష్ణకు భార్య కళావతి, ముగ్గురు కుమార్తెలు మరియు ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడి భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జలదుర్గం ఎస్సై అనిల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## భద్రతాబలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి



**ఛత్తీస్‌గడ్:** మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ ఆపరేషన్ లో వందలాది మంది మావోలు మృతి చెందారు. వీరిలో అత్యంత కీలకమైన మావో లీడర్లు కూడా ఉన్నారు. ఇప్పటికే అనేక మంది మావోలు లొంగిపోయారు. పలువురు మావోలు లొంగిపోవడానికి సిద్దంగా ఉన్నారు. మరోవైపు, మావోలపై భద్రతాబలగాలు విరుచుకుపడుతూనే ఉన్నాయి. తాజాగా, ఛత్తీస్ గఢ్ బీజాపూర్ జిల్లా ఇంద్రావతి ప్రాంతంలో మరో ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోలు హతమయ్యారు. ఘటనా స్థలి నుంచి మృతదేహాలతో పాటు, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ... జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. పారిపోయిన మావోల కోసం కూంబింగ్ జరుగుతోందని వెల్లడించారు.

(మొదటిపేజీ తరువాయి)

## తెలుగు రాష్ట్రాలకు లాభం: చంద్రబాబు

మారిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి మార్కాపురంతో సహా వివిధ ప్రాంతాలకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు భరోసా కల్పించారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా మార్కాపురం, ఒంగోలు జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. 30 ఏళ్ల ముందు ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి.. మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2500 కోట్ల మేర ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని వివరించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ క్రెడిట్ మొత్తం వైసీపీనే చోరీ చేస్తోందని ఆగ్రహించారు. వెలిగొండకు నీళు రాకుండానే జగన్ రెడ్డి రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. కుప్పంలోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో పోశారని విమర్శించారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. డయాఫ్రాం వాల్‌ను గోదాట్లో కలిపేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఆ ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నామని చెప్పుకొచ్చారు. పుష్కరాలకంటే ముందు ఆ ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని మాటిచ్చారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. 1312 టీఎంసీల నీటిని ఏపీ ప్రాజెక్టుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం 793 టీఎంసీల నీటితో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లూ కళకళలాడుతున్నాయి. మే 15 తేదీన నారుమళ్లకు నీరిచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. 16 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సాగుతో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉంది. నీటి నిర్వహణ నుంచి పొదుపు చేసే వరకూ నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తున్నాం. ఏపీ వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపునకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సగటున 7 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భజలాలు గణనీయంగా పెరగటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల ద్వారా వినియోగం కూడా తగ్గింది. తద్వారా రూ.91 కోట్ల మేర విద్యుత్ కూడా ఆదా అయ్యింది. ఏపీలో 50 శాతం గ్రీన్ కవర్ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్క తిరుమలలోనే 89 శాతం మేర పచ్చదనం ఉంది. గత పాలనలో గుండ్ల కమ్మ గేట్లు కొట్టుకుపోతే గేట్లు పెట్టేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రాం వాల్ కొట్టుకుపోతే.. దాన్ని కూడా గుర్తించలేదు. జగన్ హయాంలో చేయని తప్పునకు నన్ను 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాను. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్టుకున్నాయో చూశాం. నీరుంటే ఎలాంటి సమస్యలూ రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యల్ని తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్ సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నాను. వ్యవసాయానికి, పరిశ్రమలకు నీరు ఇవ్వడంతో పాటూ ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యాన్ని సాధించినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకూ నీరిచ్చే ధృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు బ్లూ ప్రింట్‌ను కూడా సిద్ధం చేస్తున్నాం' అని సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం: అనగాని

కలుగుతోందని మంత్రి తెలిపారు. తద్వారా అసైన్డ్ భూముల యజమానులకు అద్దె రూపంలో ఆదాయం వస్తుందన్నారు. రెండేళ్లకు ఒకసారి లీజు మొత్తాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వాలు కలిపి 35 లక్షల ఎకరాల భూములను అసైన్డ్ చేశాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు చాలా చోట్ల చేతులు మారాయని.. పేదల నుంచి భూములు తీసుకున్నవారు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అసలు లబ్ధిదారులకే లీజు డబ్బు అందేలా చూడాలని సూచించారు. కొన్ని చోట్ల అసైన్డ్ భూముల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారని, అలాంటి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వైసీపీ హయాంలో భూముల ఫ్రీ-హోల్డ్‌లో కుంభకోణం జరిగిందని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు.

## ఇకపై స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులు

చోటికి వాటిని మారుస్తున్నామని మంత్రి తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తామని, అన్ని విభాగాల్లో సిబ్బందికి పదోన్నతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని గవర్నింగ్ బాడీగా నియమించామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ఈ చట్ట సవరణ ఉపయోగపడుతుందన్నారు. స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల పేర్లు ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తాయని అన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉండటంతో అక్కడి సిబ్బందిలో హార్టికల్చర్ నిపుణులను నియమించవచ్చని సూచించారు. అభివృద్ధికి అసలైన చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలన్నారు. సంపద సృష్టించే క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు.

# కొనసాగుతున్న డివైఎఫ్ఐ జన చైతన్య యాత్ర



**భీమిలి, పతాకం న్యూస్:** 'డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు వద్దు, ఆరోగ్యం, జీవితం ముద్దు' నినాదంతో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశాఖలో చేపట్టిన జన చైతన్య బైక్‌యాత్ర కొనసాగింది. భీమిలిలో ఈ యాత్రకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు మనిషి ఆలోచనా సామర్థ్యాన్ని , జ్ఞాపకశక్తిని, ఏకాగ్రతను దెబ్బ తీస్తాయన్నారు. రోగ నిరోధకశక్తి బలహీనపరిచి, శాశ్వత పక్షవాతం, అకాల మరణాలకు దారితీస్తుందన్నారు. తల్లిదండ్రుల ఆశలు, నమ్మకాలను వమ్ము చేస్తూ, ఈ మత్తు పదార్థాలకు బానిసైన యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కె మహేష్ మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాల నియంత్రణకు విద్యాసంస్థల్లో టాస్క్‌ఫోర్స్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కళాశాలలోనూ ఒక ప్రొఫెషనల్ కౌన్సిలర్‌ను నియమించాలన్నారు యువతకు కూటమి ప్రభుత్వం హామీ మేరకు నిరుద్యోగభృతి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ భీమిలి డివిజన్ నాయకులు మట్టా రవి కుమార్, గుజ్జు సూరిబాబు, కోరాడ ఉపేంద్ర పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి సురేఖ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఈ తరహా యాత్ర చేపట్టడాన్ని అభినందించారు.మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను ఆమె వివరించారు.

# ఏయూలో మత విద్వేషాలను అరికట్టాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రా యూనివర్సిటీలో ఆర్ఎస్ఎస్ సాగిస్తున్న మత వైషమ్య కార్యకలాపాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే చర్యలు చేపట్టాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. పిఠాపురం కాలనీలోని సిపిఎం జిల్లా కార్యాలయం (ఏచూరి భవన్)లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు ఎయులో నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహ్మాన్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు కె.నిర్మల, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు జిల్లా కార్యదర్శి డి.దేవదత్, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి ఎస్.గోవిందరాజులు మాట్లాడుతూ.. ఎయులో విద్యార్థుల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. బయట నుంచి వచ్చిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారని, దీనిపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. సోషల్ మీడియాలో ఎయు విద్యార్థినులపై అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలు పెట్టి ట్రోలింగ్ చేస్తున్న ఆర్ఎస్ఎస్ మూకలపై కఠిన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ నేరుగా జోక్యం చేసుకుని వర్సిటీలో లౌకిక విలువలను, మత సామరస్యాన్ని కాపాడాలన్నారు. సెక్షన్ 30ని ఉల్లంఘించి ఇతర సంఘాల జెండాలను ధ్వంసం చేసిన వారిని, దాడులకు పాల్పడిన ఆర్ఎస్ఎస్, బిజెపి అనుబంధ సంఘాల కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని, యుజిసి నిబంధనలను అమలు చేస్తూ వర్సిటీలో సమానత్వ కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో జరుగుతున్న అరాచకాలను అరికట్టడంలో పోలీసులు, ఎయు విసి విఫలమయ్యారని నాయకులు విమర్శించారు. దాడులు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయకుండా పరోక్షంగా వారిని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ పరిణామాలకు నిరసనగా ఈ నెల 27న విశాఖ జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, బి.రమణి, సిపిఐ నాయకులు కె.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, ఎంసిపిఐ నాయకులు ప్రమీల పాల్గొన్నారు.

# ఉత్పత్తితో వేతనాలను ముడిపెట్టడం దుర్మార్గం




**గాజువాక, పతాకం న్యూస్:** ఉత్పత్తి పెంపులో యాజమాన్యం, ప్రభుత్వ వైఫల్యాలన్ని ఉద్యోగులు, కార్మికులపై రుద్దడం సహించరాదని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో స్మృత్యంజలి పార్కు వద్ద స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు.ఈ సందర్భంగా జె అయోధ్య రామ్ మాట్లాడుతూ కష్టపడి పని చేసిన కాలానికి జీతం పొందే హక్కును కాలరాయడం దుర్మార్గమని, పోరాటాల ద్వారానే దాన్ని సాధించుకుందామన్నారు. ద్వంద ప్రమాణాలు పాటిస్తూ కార్మికులపై వివక్షత చూపుతున్న స్టీల్ మంత్రికి నిరసన తెలియజేసే పోరాటంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెల పూర్తి జీతాలు చెల్లించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామనిహెచ్చరించారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు యు రామస్వామి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌లోనే ఉత్పత్తితో జీతాలను ముడి పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సిపిఎం ఎంపీతో స్టీల్ మంత్రికి లేఖ రాయించామన్నారు. ఇంత జరుగుతున్నా గుర్తింపు యూనియన్ పోరాటానికి రాకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు ఎం రామారావు, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, పుల్లారావు, ఆర్ వెంకట్రావు, కార్మికులు పాల్గొన్నారు.

# వలస కార్మికుల చట్టం అమలు చేయాలి



**పరవాడ, పతాకం న్యూస్:** ఫార్మసిటీ, ఎస్ఇజెడ్‌లో వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ, తాడి, లంకెలపాలెం ఎస్ఇజెడ్ ప్రాంతాల్లో వలస కార్మికులు నివాసాలు ఉంటున్న షెడ్లను సిఐటియు నేతలు పరిశీలించారు. ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు తమ కుటుంబాలతో ఏ విధమైన సౌకర్యాలు లేకుండా తడకలు, రేకుల షెడ్లు, గుడారాల్లో ఉన్న పరిస్థితిని చూశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వలస కార్మికులకు కార్మిక చట్టాలు అమలకు నోచుకోవడం లేదని, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయనిక పరిశ్రమలు ఆనుకొని వీరికి నివాసాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కడుపు చేత పట్టుకొని ఆయన వారిని తమ ఇళ్ల వద్దే వదిలి, కొంతమంది భార్యా పిల్లలతో వలస వచ్చి ఇక్కడ దుర్భర జీవితాలు గడుపుతున్నారని వాపోయారు. ఏ విధమైన సదుపాయాలు లేని గుడారాల్లో పిల్లలు, తల్లులు ఉంటున్నారని, కనీసం మరుగుదొడ్లు కూడా లేక బహిర్భూమికి ఆరు బయటకు వెళ్లాల్సిన దుస్థితి ఉందని, ఇలాంటి సమయంలో మహిళలకు రక్షణ ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు. గతంలో అచ్చుతాపురం ఎస్ఇజెడ్‌లో ఒక మహిళాపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన తరువాతైనా జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా డెవలప్మెంట్ కమిషనర్, కార్మిక శాఖ, పోలీస్, రెవెన్యూశాఖలు విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలస కార్మికుల చట్ట ప్రకారం తహశీల్దారు కార్యాలయంలో వలస కార్మికుల రికార్డు నమోదై ఉండాలని, అలాంటిదేమీ ఇక్కడ అమలు కావడం లేదని పేర్కొన్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా కార్మికులను దోచుకుంటున్నారని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థిని ఆత్మహత్య

**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక వుడా కాలనీలో పైడా రజిని (21) అనే వైద్యవిద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయింది. మధురవాడలో ప్రైవేట్ కళాశాలలో ఫిజియోథెరపీ సెకండ్ ఇయర్ చదువుతోంది. బుధవారం రాత్రి కాస్త ఆలస్యంగానే ఇంటికి చేరుకున్న యువతి, తర్వాత కాసేపటికే ఈ అఘాయిత్యానికి పాల్పడింది. ప్రేమ విఫలం కావడం వల్లే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ లెటర్‌లో రాసుకున్నట్లు సమాచారం .గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విశాఖలో పాల విక్రయ కేంద్రాలపై ఆహార భద్రతా అధికారుల మెరుపుదాడులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పాలు, నీళ్లు కల్తీ అయి ప్రజల ప్రాణాలను తోడేస్తున్నాయంటే ఆశ్చర్యం కానే కాదు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు ఆరుగురి ప్రాణం తీసి, పలువురిని ఆసుపత్రులపాలు చేసిన ఉదంతం విశాఖలోని పరిస్థితులనూ తెరపైకి తెచ్చింది. జివిఎంసి పరిధిలో పాల కల్తీపై ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. రకరకాల పద్ధతుల్లో పాల కల్తీ జరుగుతోందని, తమ ఆరోగ్యాలు చెడిపోతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ తరుణంలో రాజమహేంద్రవరంలో కల్తీ కాటుతో పలువురు ప్రాణాలు కోల్పోయిన దరిమిలా ఎట్టకేలకు విశాఖ జిల్లాలోని ఆహార భద్రతా అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని లూజ్ మిల్క్ విక్రయ కేంద్రాలపై మెరుపు దాడులు చేశారు. అణువణువుగా పరిశీలించారు. డిస్ట్రిక్ట్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జివి.అప్పారావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కల్యాణ్ చక్రవర్తి నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. ఐదు ప్రధాన పాల విక్రయ కేంద్రాల నుంచి నమూనాలు సేకరించారు. అక్కయ్యపాలెంలోని డైరెక్ట్ ఫార్మ్ మిల్క్‌లో ఆవు పాలు, కృషి డెయిరీ ఫార్మ్ గేదె పాలు, సీతమ్మధారలోని ఆంథోనీ డెయిరీ గేదె పాలు, శివాజీపాలెంలోని రబ్బానీ మిల్క్ ఫుడ్స్ గేదె పాలు, రామాటాకీస్‌లోని భారతి మిల్క్ ఫుడ్స్ గేదె పాలను తనిఖీ చేశారు. లాక్టోమీటర్ సహాయంతో పాల సాంద్రతను కొలిచి, నీటి కల్తీ జరిగిందా ? అనే అంశాన్ని ప్రాథమికంగా పరిశీలించారు. పిహెచ్ ఇండికేటర్ పేపర్ల ద్వారా పాలలోని రసాయనిక మార్పులను గమనించారు. సేకరించిన నమూనాలను తదుపరి విశ్లేషణ కోసం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపారు. అక్కడ పాలలోని వెన్న శాతం, ఎస్ఎన్ఎఫ్, చక్కెర, పిండి పదార్థాలు, యూరియా, కార్బైడ్లు, హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి హానికర రసాయనాల ఉనికిని పరీక్షించనున్నారు. పరీక్షా ఫలితాల్లో పాలు ప్రమాణాలకు అనుగుణంగా లేకపోయినా లేదా కల్తీ జరిగినట్లు తేలినా ఎఫ్ఎస్ఎస్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నాణ్యత లోపిస్తే సెక్షన్ 51 కింద రూ.5 లక్షల వరకు జరిమానా, తప్పుదారి పట్టించే లేబులింగ్ చేస్తే సెక్షన్ 52 కింద రూ.3 లక్షల వరకు జరిమానా. హానికర కల్తీకి పాల్పడితే సెక్షన్ 59 కింద రూ.10 లక్షల జరిమానాతో పాటు నేర తీవ్రతను బట్టి జీవిత ఖైదు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నివేదిక అందిన వెంటనే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఆహార భద్రతా అధికారులు పి.శ్రీను, ఎస్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.ప్రమాణాల సంస్థ ఏం చెబుతోంది ? భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ తాజా గణాంకాల ప్రకారం.. ఆహార పదార్థాలు, ఉత్పత్తుల కల్తీ నానాటికీ పెరుగుతోంది. నియంత్రణ వ్యవస్థలు బలోపేతం కావడం లేదు. 2018లో 23 శాతంగా ఉన్న కల్తీ రేటు నేడు 35 శాతం దాటిపోయిందని అంచనా. మార్కెట్‌లో లభించే వస్తువుల్లో మూడింట ఒకటి కచ్చితంగా కల్తీ అవుతోంది.

# చింతపల్లి క్యాంప్‌లో పోలీసుల కార్డెన్ సెర్చ్



**సీలేరు, పతాకం న్యూస్:** జీకేవీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల చింతపల్లి క్యాంప్‌లో సీలేరు పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఉదయం ఆరు గంటలకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి ఎస్ఐ యం.డీ.యాసీన్ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశారు. అనుమానితులను ప్రశ్నించి వారి వ్యక్తిగత జీవితం నేరమయంగా ఉందా?, అని పరిశీలించి అనంతరం విడిచిపెట్టారు. నాలుగు ద్విచక్ర వాహనాలకు ఎటువంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. గంజాయి, నాటు సారా, ఇతర అక్రమ వ్యాపారాలు చేసినా చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడిపితే ఆ వాహన యాజమానిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, సంఘ విద్రోహ శక్తులు గ్రామంలోకి ప్రవేశిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ యాసీన్ కోరారు. తెల్లవారుజామునే పోలీసులు రావడంతో ఏం జరిగిందోనని గ్రామస్థులు ఆందోళన చెందారు. సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంత వరకు ఎప్పుడూ కార్డెన్ సెర్చ్ నిర్వహించలేదు.

# సైన్స్ బోధనపై గీతంలో ముగిసిన శిక్షణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** : దేశం గర్వించతగ్గ శాస్త్రవేత్తలు తయారు కావాలంటే విద్యార్థి దశలోనే అందుకు తగ్గ స్ఫూర్తి, ప్రేరణ అవసరమని భావించి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి) విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా నగరంలోని పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక వర్క్‌షాప్, శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "లెట్ అజ్ డు సైన్స్" పేరిట అమలు చేస్తున్న ప్రాజెక్టులో భాగంగా భౌతిక, జీవ శాస్త్రాలతో పాటు ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాలలో ఆసక్తికరమైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల జాబితాను రూపొందించి ఉపాధ్యాయులకు తరగతి గదిలో చిన్న, చిన్న శాస్త్ర ప్రయోగాలను విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి కలిగించేలా ఎలా బోధించాలో శిక్షణ ఇచ్చారు. నగరంలోని డైట్‌తో పాటు రామకృష్ణ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భారతి పాఠశాల, శ్రీధర్శన్ పాఠశాల, డాక్టర్ సిఆర్.రెడ్డి కళాశాల నుంచి 70 ఉపాధ్యాయులకు భౌతికశాస్త్రంలో, మరో 60 మంది ఉపాధ్యాయులకు జీవ శాస్త్రంలో శిక్షణ అందించినట్లు ప్రాజెక్టు బృందానికి నేతృత్వం వహించిన గీతం భౌతికశాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ బి.స్పందన తెలిపారు. విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.విజయ భాస్కర్, సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌లు పాల్గొని ఉపాధ్యాయులకు భౌతిక, జీవ శాస్త్రాలలో నూతన అంశాలపై అవగాహన కలిగించారు.

# అందరి సహకారంతో అభివృద్ధి




**పాడేరు, పతాకం న్యూస్:** సంపూర్ణత అభియాన్ 2.0లో భాగంగా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో నీతి అయోగ్ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళల సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, నీతి అయోగ్ అధికారిణి శ్రేయ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి దిశగా నడిపేందుకు అందరి సహకారం కావాలని, అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని, యాక్షన్‌ప్లాన్‌తో పక్కాగా ముందుకు సాగుదామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు పాటుపడాలని, సంపూర్ణత అభియాన్ 2.0 కింద జిల్లాస్థాయిలో ప్రణాళికలను రూపొందించామని, ఫలాలను నేరుగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడతామన్నారు. మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా, మౌలిక వసతుల కల్పనకు, వైద్య ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టిసారించామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలందించడమే ముఖ్య ఉద్దేశమని వివరించారు.

## గంజాయి లేని సమాజమే లక్ష్యం

### విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్



**విజయనగరం, పతాకం న్యూస్:** గంజాయి లేని సమాజమే లక్ష్యమని, ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టీ అన్నారు. విశాఖ రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో సాగిన గంజాయి వ్యతిరేక పోరాట వివరాలను ఆయన వెల్లడించారు. 'గత 20 నెలల్లో గంజాయి స్మగ్లర్లపై మెరుపుదాడులు చేశాం. 976 కేసులు నమోదు చేసి 2,405 మందిని అరెస్టు చేశాం. 55,346.292 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. 685 వాహనాలు సీజ్ చేసి 24 అంతరాష్ట్ర ముఠాలను గుర్తించాం. 129 మంది సభ్యులపై నిరంతర నిఘా ఉంచాం. 33 అత్యా?ధునిక డ్రోన్‌ల ద్వారా 129 హాట్‌స్పాట్‌లపై 1,360 సార్లు నిఘా పెట్టి, నిందితులను అక్కడికక్కడే అరెస్టు చేశాం. పిట్‌ఎన్‌డీపీఎస్ ( కఠిన చట్టాల ప్రయోగం) సాంకేతిక నిఘాతో 1,599 మందిపై హిస్టరీ షీట్లు తెరిచాం. యువత తమ బంగారు భవిష్యత్తును మత్తుకి బలిచేయవద్దు.' అని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు మోహన్, విష్ణుస్వరూప్, శ్రావణి, శ్రీనివాసరావు, బి.మోహనరావు, ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జునరావు, బాల సూర్యారావు పాల్గొన్నారు.

## చంద్రబాబు పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలి



**చీపురుపల్లి, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని హోంశాఖ మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 28న ముఖ్యమంత్రి బాబునాయుడు జిల్లాకు రానున్నారు. చీపురుపల్లి మండలం రావివలస గ్రామంలో ఆయన పర్యటించనున్నారు. లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో హోంమంత్రి అనిత వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం పర్యటనపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అలసత్వం వద్దని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన ప్రదేశంలో గురువారం నాటికి హెలిప్యాడ్ పనులు పూర్తి కావాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలన్నీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధుల భోజన ఏర్పాట్లపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి సభ ప్రాంగణానికి చేరుకున్న సమయం నుంచి తిరుగు ప్రయాణమయ్యే ఎటువంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక నాయకుల సమాచారం ప్రకారం సీఎం ప్రజావేదికకు సుమారు 3500 మంది హాజరవుతారన్నారు. చీపురుపల్లి నుంచి సభ ప్రాంగణం వరకూ తారు రోడ్డు నిర్మిస్తున్నామని, హెలిపాడ్ పనులు కూడా గురువారం సాయంత్రం నాటికి పూర్తవుతాయని అన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, జేసీ సేతుమాధవన్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం, రావివలసలో జరుగుతున్న సీఎం సభ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.

## రోడ్డు వేస్తున్నారు... మట్టి తీయడం మరుస్తున్నారు.?



**పొదిలి, పతాకం న్యూస్:** లక్షల రూపాయలతో రోడ్డు మరమ్మత్తులు చేస్తున్న అధికారులను ఆక్రమణలు వెక్కిరిస్తున్నాయి. రహదారులు భవనముల శాఖకు చెందిన ప్రధాన రహదారుల అంచులలో మట్టిని తొలగించకపోవడంతో నీరంతా రోడ్డు మీద పారుతూ మరమ్మత్తులు చేసిన కొద్ది రోజులకే అవి పూర్తిగా దెబ్బతింటున్నాయి. పొదిలి పట్టణంలో పలుదఫాలుగా మరమ్మత్తులు చేసినా మురుగు కాలువలు లేకపోవడం, చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై పారడంతో మరమ్మత్తులు వృథా అవుతున్నాయని గురువారం గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు కాంట్రాక్టర్లు ఈ పేరుతో మమా అనిపించి బిల్లులు చేసుకుంటున్నారు తప్ప, వారు వేసిన రోడ్లను సంరక్షించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2025 సంక్రాంతి నాటికి రాష్ట్రంలో మంచి రహదారులు ఉంటాయని చంద్రబాబు చెప్పినా నేటికీ అవి పూర్తి కాలేదని అన్నారు. తాజాగా వాటికే మరమ్మత్తులు చేస్తూ గతుకుల రోడ్డుకు అతుకులు వేస్తున్నారని అన్నారు. అయితే ఈ రహదారుల అంచుల్లో దుకాణదారులు ఆక్రమించి పోసిన మట్టిని తొలగించకపోవడంతో వేసిన రోడ్లు ఎన్నాళ్ళు ఉంటాయో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# తాగునీరు, డ్రైనేజీలకు రూ.118 కోట్లు: నారాయణ



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** నగరంలో తాగునీరు, డ్రైనే జీ, మురుగునీటి శుద్ధి కోసం రూ.118 కోట్లు కేటాయిస్తున్నామని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శ్రీకాకుళంలోని దమ్మలవీధి, మొండేటి వీధి, కంద్రవీధి, ఎచ్చెర్ల వీధి తదితర ప్రాంతాల్లో ప్రబలిన డయేరియా అదుపులోకి వచ్చిందని, బాధితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పర్యటించారు. డయేరియాతో మృతి చెందిన మండల సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం డయేరియా బాధితులతో మాట్లాడారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించా రు. వారి పరిస్థితి ఎలా ఉందని వైద్యుల ను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాల యం వద్ద మీడియాతో మాట్లాడారు. 'దురదృష్టవశాత్తు డయేరియాతో ఒకరు మరణించడం చాలా బాధాకరం. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి తక్షణ సాయంగా రూ.10లక్షల పరిహారం చెక్కు అందజేశాం. వారికి అన్ని విధాలా అండగా ఉంటాం. నగరంలోని తాగునీటి వ్యవస్థ శాశ్వత పరిష్కారం కోసం రూ.60 కోట్లు కేటాయించాం. డ్రైనేజీ కాలువ ఆధునికీకరణకు రూ.35 కోట్లు, మురుగు నీటి శుద్ధి కోసం రూ.23 కోట్లు కేటాయించాం. దీంతో శ్రీకాకుళంలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య తీర నుంది. ఇప్పటివరకు నగరంలో 102 డయేరియా కేసు లు నమోదు కాగా, అందులో కేవలం రెండు కేసుల్లో బాధితులకు డయాలసిస్ జరుగుతోంది. బుధవారం 13 మంది రోగులు డిశ్చార్జి అయ్యారు. మిగిలిన వారి పరిస్థితి బాగున్నా సరే 24 గంటలు అదనంగా పరిశీ లనలో ఉంచాలని నిర్ణయించాం. వారంతా ఒకటి, రెం డు రోజుల్లో డిశ్చార్జి కానున్నారు. బాధితులకు ప్రభు త్వం తరపున పూర్తిస్థాయిలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు.

## షెడ్యూల్డ్ గ్రామాలను వెబ్‌సైట్‌లో చేర్పునకు హామీ



**మక్కువ, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతాల్లోని షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను ఏపీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో చేర్చేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హామీ ఇచ్చారని ట్రైబల్ వెల్‌ఫేర్ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మండల గిరిధర్ ఆధ్వర్యంలో సభ్యులు నిమ్మిక సింహాచలం మంచాల ఈశ్వరరావు, మువ్వల అప్పారావు అమరావతిలోని కార్యాలయంలో మంత్రి సంధ్యారాణిని కలిశారు. గిరిజన ప్రాంతంలోని గ్రామాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో చేర్చాలని కోరగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. గిరిజన షెడ్యూల్డ్ గ్రామాలను వెబ్‌సైట్‌లో చేర్చేందుకు కృషి చేస్తానని మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారని గిరిధర్ తెలిపారు.

## విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



**భోగాపురం, పతాకం న్యూస్:** విద్యార్థులు అన్ని విభాగాల్లో నైపుణ్యం పెంచుకోవా లని ఏపీ మోడల్ స్కూల్ కేంద్ర ప్రత్యేకా ధికారి నీరాజ్‌కుమార్ గయాజీ కోరారు. భోగాపురం సమీపంలో గల ఏపీ మోడల్‌స్కూల్ పరిసరాలు, తరగతి గదులు, క్రీడాస్థలం, ఎండీఎం, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాల గురించి తెలుసుకొన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో మాణిక్యాల నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు, ప్రిన్సిపాల్ సంధ్య పాల్గొన్నారు.

## చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి: పార్థసారథి



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు చేనేత ఉత్పత్తుల విక్రయాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటు చేస్తోందన్నారు.ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను మంత్రి కొలుసు పార్థసారథి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత ఉత్పత్తులను, వాటి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్పందనతో అమ్మకాల గురించి ఆరా తీశారు. నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబోతున్నామన్నారు. చేనేత సహకార సంఘాలకు విడతలవారీగా బకాయిలు సైతం విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారని మంత్ర కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు.

## రక్షిత మంచినీటి పథకాలను పరిశుభ్రంగా ఉంచాలి



**టెక్కలి, పతాకం న్యూస్:** రక్షిత మంచినీటి పథకాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) భారతీ సౌజన్య అన్నారు. టెక్కలిలో పలు రక్షిత నీటి పథకాలను సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. నిరంతరం పర్యవేక్షిస్తూ క్లోరినేషన్ శతశాతం జరిగేలా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే ఫ్లోరైడ్ శాతం ఎప్పటికప్పుడు పరిశీలిం చా లని సూచించారు. ప్రతీ హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లల్లో వే డి పదార్థాలు కాచిన నీటిని వినియో గదారులకు అందించాలని ఆదేశించా రు. పట్టణంలో కాలువలు మురికి నిల్వప్రాంతాలు కూడా పరిశీలించి అన్నింటా ముందస్తుచర్యలు చేపట్టా లని అన్నారు. ఎక్కడైనా తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎల్ పీవో ఐవీ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్, కార్యదర్శి ఏవీ శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

## దారి లేక గిరిజనుల అవస్థలు



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ కర్రిమామిడి, పందిరిమామిడి గ్రామాలకు రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరినైనా ఆస్పత్రికి తరలించాలన్నా, రేషన్ సరుకులు తెచ్చుకోవాలన్నా కొండలు, గుట్టలను దాటుకుంటూ దట్టమైన అటవీ ప్రాంతం గుండా ప్రయాణించాల్సిందే. ఈ రెండు గ్రామాల్లో సుమారు 30కి పైగా గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరంతా ప్రతి నెలా రేషన్ సరుకుల కోసం పినకోట పంచాయతీ కేంద్రానికి కాలినడకనే వస్తుంటారు. రానుపోనూ సుమారు 16 కిలోమీటర్లు కాలినడకనే చేరుకోవాల్సి వస్తోందని వారంతా వాపోతున్నారు. బొర్రాపాలెం వై జంక్షన్ నుంచి 4 కిలోమీటర్లు రోడ్డు సౌకర్యం కల్పిస్తే పందిరిమామిడి, కర్రిమామిడి గ్రామాలకు మేలు జరుగుతుంది. రెండేళ్ల క్రితం ఆయా గ్రామస్థులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో అప్పట్లో రోడ్డు నిర్మాణం కోసం అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బొర్రాపాలెం గ్రామం వరకు రేషన్ సరుకులు వస్తే అక్కడ నుంచి తీసుకోవడం తమకు సులభమని కర్రిమామిడి, పందిరిమామిడి గ్రామాల గిరిజనులు చెబుతున్నారు. ఈ గ్రామాల నుంచి బొర్రాపాలెం రోడ్డు వరకు 4 కిలోమీటర్లు ఉంటుందని, గత ప్రభుత్వంలో బొర్రాపాలెం వరకు వాహనం వచ్చి సరుకులను సరఫరా చేసేదని వారు తెలిపారు. అయితే ప్రస్తుతం పినకోట వెళ్లి సరుకుల తెచ్చుకునేందుకు రానుపోనూ 16 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులను సుమారు నాలుగు కిలోమీటర్లు డోలీలో బొర్రాపాలెం వరకు మోసుకురావాల్సి వస్తోందని, రోడ్డు సౌకర్యం కల్పిస్తే సమస్యలు ఉండవని వారు చెబుతున్నారు.

## తెలంగాణలో 45 మంది ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో భాగంగా అత్యంత కీలకమైన సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) బాధ్యతలను రాహుల్ బొజ్జాకు అప్పగించారు. ఆయన జీఏడీ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తూనే, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను కూడా చూసుకోనున్నారు. సీనియర్ అధికారుల బాధ్యతల్లోనూ ప్రభుత్వం పలు మార్పులు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్‌ను, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించింది. ఆర్థిక మరియు ప్రణాళికా విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బాధ్యతలు చేపట్టనుండగా, దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఎం. హనుమంతరావుకు (దేవదాయ శాఖ కమిషనర్) అప్పగించారు.

## ‘ప్రైవేట్’కు ఆర్టీసి డిపోలు అప్పగించవద్దు




**విజయవాడ, పతాకం న్యూస్:** ప్రైవేట్ విద్యుత్ బస్సులకు ఆర్టీసి డిపోలను అప్పగించడాన్ని ఆపాలని కోరుతూ సిఎం చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. పి. ఎం. ఈ – పేరుతో ప్రైవేటు విద్యుత్ బస్సులను పూణే కు చెందిన పినకల్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు, దానికోసం 11 డిపోలకు చెందిన 12 స్థలాలను వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పత్రికల్లో వార్తలు రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పీఎం ఈ– బస్సు సేవ పథకంలోని గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు సంస్థల ద్వారా బస్సులు నిర్వహించే పద్ధతి అటు ఆర్టీసీ సంస్థకు, ఇటు ప్రజలకు ప్రయోజనం కాదన్నారు. విజయవాడలోని విద్యాధరపురం, గుంటూరు 2, నెల్లూరు 2, తిరుపతిలోని మంగళం డిపోలను పూర్తిగా, మరో 8 డిపోలను పాక్షికంగా ప్రైవేట్ వారికి ఇవ్వాలని ఆర్టీసీ ఉత్తర్వులు ఇవ్వడం, ఆర్టీసీ మనుగడకు, ప్రజల ప్రయోజనాలకు నష్టకరమన్నారు. అలాగే మరికొన్ని సీఎన్జీ బస్సులను కూడా నడపనున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఈ కొత్త విధానంపై కార్మిక సంఘాలతో, నిపుణులతో చర్చించడంతో పాటు, ఇతర రాష్ట్రాల్లో అమలుతీరు పై సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యుత్ బస్సులను నడపాల్సివస్తే దశలవారీగా ఆర్టీసీ సంస్థ ద్వారానే నడపాలన్నారు.

## జిమ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగి మృతి



**అమరావతి, పతాకం న్యూస్:** చిత్తూరు జిల్లా పలమనేరులో బుధవారం ఉదయం ఓ బ్యాంకు ఉద్యోగి హఠాత్తుగా చనిపోయాడు. స్థానిక గుడియాత్తం రోడ్డులో ఉన్న ఓ జిమ్ సెంటర్లో పాత పేటకు చెందిన మల్లికార్జున ఏకైక కుమారుడు విశ్వనాథ్ అనే యువకుడు ఉదయం జిమ్ చేస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. బయటకు వచ్చి వాంతులు చేసుకున్నాడు. వెంటనే స్నేహితులు వచ్చి కొబ్బరి నీళ్లు తాగించి పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విశ్వనాథ్ వి. కోట డీసీసీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

## జీతాలు చెల్లించాలంటూ కార్మికుల ఆందోళన



**గుంటూరు, పతాకం న్యూస్:** రాజధాని అమరావతిలోని నేలపాడు ఎన్‌జీఓ టవర్స్ వద్ద షాపూజీ –పల్లోంజి నిర్మాణ సంస్థ కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. 5 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లిచాలని డిమాండ్ చేశారు. జీతాలను చెల్లిస్తేనే పనులు చేస్తామని స్పష్టం చేశారు. కార్మికులతో యాజమాన్యం ప్రతినిధులు చర్చలు జరుపుతున్నారు. వార్తను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.

## కూలీల ఉపాధిని దెబ్బతీస్తున్న బీజేపీ ప్రభుత్వం



**నిడదవోలు, పతాకం న్యూస్:** కేంద్రంలోని మోధ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా గ్రామీణ ప్రజలు ఉపాధిని దెబ్బతీస్తుందని నిడదవోలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర అన్నారు.మండలంలోని కలవచర్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కాంగ్రెస్ పార్టీ బృందం కలిసింది. కూలీలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బద్రందొర మాట్లాడుతూ 2005లో యుపిఐ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఈ చట్టం ద్వారా ఉపాధి కూలీలకు 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం భరిస్తే, మరో 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేలా చట్టం చేసిందన్నారు. ప్రస్తుత మోధ ప్రభుత్వం ఈ చట్టానికి తూట్లు పొడుస్తూ రాష్ట్రాలపై అధిక భారాన్ని మోపేలా ఈ చట్టం స్థానంలో విబి గ్రామ్‌జీ పథకాన్ని తెచ్చిందన్నారు. తద్వారా రాష్ట్రాలపై 40 శాతం భారాలను మోపిందన్నారు. పైగా ఈ చట్టానికి ఉన్న మహాత్మగాంధీ పేరును సైతం తొలగించిందని అన్నారు. మహాత్మాగాంధీని భౌతికంగా గాడ్సే హత్య చేస్తే, మానసికంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హత్య చేసిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగిం చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిళరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పర్యటన సాగిస్తున్నారని తెలిపారు.

# సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు ఏవి?



**సీతంపేట, పతాకం న్యూస్:** గిరిజనాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు నాలుగేళ్లుగా నిర్వహించడం లేదు. ప్రతి మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి. ఈ సమావేశాల్లో ఐటీడీఏ ద్వారా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించాలి. గిరిజన సమస్యలను పరిష్కరించాలి. కాగా వైసీపీ ప్రభుత్వ పాలనలో 2022లో జనవరి 29న అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణి అధ్యక్షతన 77వ పాలకమండలి సమావేశం నిర్వహించారు. అప్పటి నుంచి నాలుగేళ్ల పూర్తయినా.. నేటికీ సమావేశం నిర్వహించకపోవడం గమనార్హం. రెగ్యులర్ పీవో లేకపోవడమే ఇందుకు కారణం. పాలకవర్గ సమావేశాలు నిర్వహించక పోవడంతో అధికారులు సైతం సమస్యలు తెలుసుకునే అవకాశం లేకపోతోంది. ఇన్‌చార్జిలతో కాలం నెట్టుకొస్తుండడంతో పాలనపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 మండలాలు ఉండేవి. వైసీపీ హయాంలో జిల్లా పునర్విభజనలో భాగంగా పాలకొండ నియోజకవర్గాన్ని.. కొత్తగా ఏర్పాటు చేసిన పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న సీతంపేట ఐటీడీఏ అటు ఆ జిల్లాకు.. ఇటు శ్రీకాకుళం జిల్లా పరిధిలో కొనసాగుతోంది. ఐటీడీఏ పరిధిలోని 16 మండలాలు శ్రీకాకుళం జిల్లాలో, మరో నాలుగు మండలాలు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నాయి. అప్పట్లో ఐటీడీఏ పీవోగా కల్పనకుమారి ఉండేవారు. ఎన్నికల ముందు బదిలీ అయ్యారు. ప్రస్తుత కూటమి పాలనలో రెగ్యులర్ పీవోలు లేరు. ఇన్‌చార్జి పీవోగా పాలకొండ సబ్‌కలెక్టర్‌గా గతంలో పనిచేసిన యశ్వంత్ కుమార్ పనిచేశారు. ప్రస్తుతం పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఇన్‌చార్జి పీవోగా వ్యవహరిస్తున్నారు. అలాగే సీతంపేట ఐటీడీఏ.. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉండడంతో ఏ జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారో తెలియక అధికారుల్లో సైతం గందరగోళం కనిపిస్తోంది. దీంతో పాలనపరమైన ఇబ్బందులు కనిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ఐటీడీఏకు వచ్చిన సబ్‌ప్లాన్ నిధులను కార్పొరేషన్లకు మళ్లించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నా.. నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయో.. లేదో పర్యవేక్షించే నాథులు కరువయ్యారు.

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 672 గిరిజన గ్రామాల్లో 93,877 మంది గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. కనీస వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. 145 గిరిజన గ్రామాల్లో రహదారులు సక్రమంగా లేవని అధికారులు గుర్తించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.51 కోట్లు నిధులు మంజూరు చేసి.. రహదారి పనులు చేపడుతోంది. కాగా వీటిని పర్యవేక్షించేవారు లేక ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.

గురుకులాల బాధ్యత కూడా ఐటీడీఏదే. కాగా చాలా గిరిజన వసతిగృహాల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు గాడి తప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల బందపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు రెండువర్గాలుగా వీడి రచ్చకెక్కారు. దీంతో అక్కడ పనిచేసిన సిబ్బందికి డిప్యుటేషన్‌పై పంపించేశారు. పీవోల పర్యవేక్షణ లేక ఎక్కడా మెనూ సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ పాలనలో ఉన్న సిబ్బందే కొనసాగుతూ.. అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది సిబ్బందిని వెనుకేసుకు వస్తున్నారంటూ ఇద్దరు ఉన్నతాధికారులపై గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఐటీడీఏపై పీవో పూర్తిస్థాయి దృష్టి సారించకపోవడంతో అవకతవకలు జరుగుతున్నాయని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను నియమించాలని, సక్రమంగా పాలన సాగేలా గిరిజనాభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# మొక్కుబడిగా ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం!

**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ఏదో వచ్చామా? వెళ్లామా? అన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి మంగళ, బుధ వారాల్లో గ్రామాల్లో ఏదో ఒక పొలంలో బ్యానర్ పెట్టడం.. ఆ సమయంలో అక్కడ ఉన్న రైతులతో ఒక ఫొటో దిగడం.. దాన్ని వారి ముఖ్య కార్యాలయానికి అప్‌లోడ్ చేయడం.. ఆ రోజు కార్యక్రమానికి అయ్యే ఖర్చులను బిల్లులు పెట్టుకోవడం.. ఇదే ‘పొలం పిలుస్తోంది’ పేరిట నిత్యం జరుగుతున్న తంతు. రైతులకు సాగుపై అవగాహన కల్పించడం గానీ, సూచనలు, సలహాలు ఇవ్వడం గానీ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ కార్యక్రమంతో రైతులకు ఒనగూరే ప్రయోజనాలేవీ లేకుండా పోయాయి. జిల్లాలో 27 మండలాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో 1.41 లక్షల హెక్టార్లలో, రబీలో 80,243 హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగుచేస్తుంటారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, రాగులు, ఉలవలు, పెసర, మినుము, చెరకు, నువ్వులు, కూరగాయలు వంటివి పండిస్తుంటారు. అయితే, ప్రతి సంవత్సరం వాతావరణ ప్రతికూల పరిస్థితులు, చీడపీడలు, తెగుళ్లతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంటుంది. సరైన సాగు సలహాలు లేక ఏటా రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమానికి 2024 సెప్టెంబరు 10న శ్రీకారం చుట్టింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, పట్టు పరిశ్రమ, సేంద్రియ, మార్కెటింగ్ శాఖ అధికారులను పొలంబాట పట్టాలని ఆదేశించింది. వీరంతా రైతులతో సమావేశాలు కావాలి. వారికి సరైన సాగు సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఖరీఫ్, రబీలో చెరో నాలుగు నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించింది. ప్రతి మంగళ, బుధవారాల్లో విధిగా నిర్వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. అయితే, జిల్లాలో ఈ ఏడాదిన్నరలో అధికారులు కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాలి. ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కల్పించాలి. ఉద్యానవన పంటల సాగులో మెలకువలు నేర్పించాలి. భూసార పరీక్షలు నిర్వహించాలి. మట్టి నమూనాలను సేకరించాలి. అందుకు అనుగుణంగా వినియోగించాల్సిన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. మార్కెటింగ్ కమిటీల ద్వారా ఉత్పత్తులను విక్రయించేందుకు అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు




చేయాలి. పంటల సాగులో పెట్టుబడులు తగ్గించి ఆదాయం పెంచేందుకు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఆధునిక సేద్యంపై అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు పంట దిగుబడి తగ్గడాన్ని విశ్లేషించడం, సూక్ష్మపోషణ లోపాన్ని గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం దిశగా ప్రోత్సహించడం చేయాలి. కౌలురైతుల గుర్తింపు కార్డుల జారీ, రైతుమిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం వంటి వాటిపై రైతులను చైతన్యవంతం చేయాల్సి ఉంది. కానీ చాలా మండలాల్లో ఈ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగానికి అనుబంధంగా ఉన్న సుమారు 14 శాఖల సేవలను వినియోగించుకోవాలని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది. కానీ, ప్రభుత్వ ఆదేశాలను కొందరు అధికారులు బేఖాతరు చేస్తున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల, నియోజకవర్గస్థాయి అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. వ్యవసాయశాఖ సిబ్బంది తప్ప మిగిలినవారు గ్రామాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు హాజరు కావడంలేదు.

## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

**నందికొట్కూరు, పతాకం న్యూస్:** మార్చి 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి దివ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణంలో బాగా స్టేషన్ న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజీ అయ్యే సివిల్, క్రిమినల్ తగాదాలలో ఇరుపక్షాలతో మాట్లాడి రాజీ అయ్యేవిధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ అయ్యే ఇరుపక్షాల కోసం ముందస్తు లోక్ అదాలత్ బెంచులను ఏర్పాటు చేశామన్నారు. నందికొట్కూరు పరిసర ప్రాంతాల్లోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి శరభయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి



**గుంటూరు, పతాకం న్యూస్:** అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్మికులు, స్కీం వర్కర్లు వేతనాలు పెంచారని ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా రాష్ట్రప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల గిఫ్ట్ కూపన్లు ఇవ్వటం ఏంటని ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ ప్రభుతం పనిచేస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ హెల్పర్ల ప్రమోషన్‌కు నిర్దిష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని, పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మే నెల అంగన్వాడి సెంటర్లకు సెలవులు ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ నాయకురాలు కె.స్వరూపరాణి, పి రజిని, ఎస్‌కె.శంషాద్ బి పాల్గొన్నారు. భాగ్యరాజు మృతికి సంతాపం సిఐటియు జిల్లా కార్యదర్శి, రాజధాని ప్రాంత నాయకుడు మంచికలపూడి భాగ్యరాజు ఆకస్మిక మరణం సిఐటియు ఉద్యమానికి తీరని లోటని లక్ష్మీనారాయణ అన్నారు. దీక్షా శిబిరంలో భాగ్యరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిన్నప్పుడు నుంచి విద్యార్థి ఉద్యమం పట్ల ఆకర్షితులై వివిధ ఉద్యమాలలో పాల్గొన్నా రన్నారు. సిఐటియులో రాజధాని ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై నిరంతరం పోరాడాడన్నరు.

# 28న ఔటర్‌రింగ్ రోడ్డు బాధిత రైతుల సదస్సు



**మంగళగిరి, పతాకం న్యూస్:** ఔటర్ రింగ్‌రోడ్‌లో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ,అలాగే గెజిట్ నోటిఫికేషన్ లో సర్వే నెంబర్లు ఇచ్చారని దీనిలో రైతుల పేరు ప్రకటించి ఏ రైతుకు ఎంత భూమి కోల్పోతున్నారో తెలపాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలురైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ అంశంపై గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో ఈనెల 28వ తేదీన జరిగే సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళగిరి రూరల్ మండలంలోని కాజా గ్రామంలో రైతు సంఘం నాయకులు ఈదా శేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఔటర్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోతున్న రైతుల సమావేశం జరిగింది. శివ శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదట రింగ్రోడ్డు కోసం 70 మీ చెప్పి ఇప్పుడు 140 మీటర్లను తీసుకుంటున్నారని అదీ చాలక 250 మీటర్లని చెబుతున్నారని దీనితో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .అలాగే రాష్ట్ర ప్రభుత్వం లక్షల ఎకరాల భూములను సమీకరిస్తుందని ఇది సరైంది కాదని అభివద్ధి పేరుతోటి భూములను లాగేసుకుంటున్నారని విమర్శించారు .ఇప్పటికే రాజధాని పేరుతోటి, రైల్వే లైన్ పేరు తోటి వేల ఎకరాల భూములను ప్రభుత్వం తీసుకుందని మరల ఔటర్ రింగ్ రోడ్డు పేరుతోటి మరొక 189 కిలోమీటర్ల మేర భూములను తీసుకుంటుందని ఇది సరైనది కాదని తెలిపారు. ఎంత అవసరమో అంత మాత్రమే భూములు తీసుకోవాలని కోరారు .అవుటర్ రింగ్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రైవేట్ మార్కెట్ రేట్ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ ఔటర్ రింగ్‌రోడ్‌లో దేవాలయ భూములు చేసుకుంటున్న వారు చెరువు పోరంబోకు భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులు ఉన్నారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్‌లో భూములకు కోల్పోతున్న రైతులతోపాటు కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. ఆ భూమి మీద ఆధారపడ్డ వ్యవసాయ కార్మికులు ఉన్నారని వారందరికీ ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని ఆ తర్వాతనే భూములు సమీకరించె దానికోసం సిద్ధపడాలని తెలిపారు .

# కౌలు రైతుల మహాసభను జయప్రదం చేయండి



**మక్కువ, పతాకం న్యూస్:** కౌలు రైతుల మహాసభలకు కౌలు రైతుల అందరూ హాజరై జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణ మూర్తి పిలుపునిచ్చారు. తూర్మామిడి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ కౌలు రైతులు అనేక ఇబ్బందులకు ఓర్చి వ్యవసాయం చేస్తున్నారని గతంలో సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి రైతు భరోసా ఇచ్చేవారని, ఋణాలు, నష్టపరిహారం ఇచ్చేవారని, ఈ క్రాప్ చేసి ప్రభుత్వ మద్దతు ధరకు పంటలు అమ్ముకొనే వారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కౌలు రైతులకు కార్డులు సక్రమంగా ఇవ్వడం లేదని ఎన్‌టిఆర్ రైతు భరోసా, ఋణాలు, పంట నష్టపరిహారం ఇవ్వడం లేదని అన్నారు. కౌలు రైతుల పోరాటాలతో సిసిఆర్‌సి కార్డులు, ఋణాలు, రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కోసం కౌలు రైతులు పోరాటాలు చెయ్యాలని, ఆ పోరాటాలకు కౌలు రైతుల సంఘం మూడవ జిల్లా మహాసభలను వేదికగా మార్చాలని పిలుపునిచ్చారు. గత పోరాటాలు గుణపాఠాలుగా తీసుకోని భవిష్యత్ పోరాటాలకు సిద్దపడడానికి కౌలు రైతులంతా మార్చి 1 వ తేదీన పార్వతీపురం ఎన్‌జిఒ హోమ్‌లో జరిగే కౌలు రైతుల 3వ జిల్లా మహాసభలకు తప్పకుండా హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కౌలు రైతులు జిల్లా మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి సత్యన్నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు, కౌలు రైతులు ఎగెరెడ్డి ఈశ్వరరావు, యాంద్రాపు రాము, యాంద్రపు పొలినాయుడు, మదక ధనుంజయ, కొల్లి సత్యనారాయణ, కొల్లి వెంకట్ నాయుడు, సలమాన సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఈడి విచారణకు హాజరైన అనిల్ అంబానీ

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) విచారణకు హాజరయ్యారు. రూ. 40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసులో ఈడి విచారణ చేపడుతోంది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఫిబ్రవరి 26న హాజరుకావాలని ఇటీవల ఈడీ ఆయనకు సమన్లు జారీ చేసింది. దీంతో ఉదయం 10:30 గంటలకు ఆయన సెంట్రల్ ఢిల్లీలోని ఫెడరల్ దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లారు. బుధవారం అనిల్‌కు చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకుంది. ఈ నివాసం విలువ సుమారు రూ. 3,716 కోట్లు ఉంటుందని అంచనా.

# మానసిక సమస్యలకు సమర్థమైన సైకోథెరపీ చికిత్స

ప్రస్తుతం మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి లెక్కే లేదు. ఒత్తిడి, యాంగ్జైటీ, డిప్రెషన్ ఇలా మెజారిటీ జనం ఏదో ఒక మానసిక సంఘర్షణతో బాధపడుతున్నారు. అయితే, వీరిలో తమ బాధను బయటికి చెప్పుకునే వారి కంటే మౌనంగా భరిస్తూ లోలోపల కుమిలిపోతున్న వారే ఎక్కువ. అయితే, ఇలాంటి మానసిక వేదన నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదంటున్నారు నిపుణులు. ఇందుకోసం సైకోథెరపీ ఓ ఔషధంలా పనిచేస్తుందని సూచిస్తున్నారు. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం! సైకోథెరపీ అనేది మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు చేసే చికిత్స, దీన్ని టాక్ థెరపీ అని కూడా అంటారు. ఇందులో భాగంగా సంబంధిత నిపుణులను సంప్రదించాలి. వారితో మానసికంగా మిమ్మల్ని ఇబ్బంది పెడుతోన్న ఆలోచనల గురించి వారితో చర్చించాలి. ఈ క్రమంలో వాళ్లిచ్చే సలహాలు, సూచనలు పాటించడం వంటివి చేయాల్సి ఉంటుంది. అయితే, ఇది కౌన్సెలింగ్ లాగా అనిపించచ్చు. కానీ ఈ రెండింటికీ మధ్య స్వల్ప వ్యత్యాసం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్ ఇస్తారని, అది కూడా స్వల్ప కాలంలో పూర్తయ్యే ప్రక్రియ అని అంటున్నారు. అదే, సైకోథెరపీలో భాగంగా వివిధ సమస్యలపై దృష్టి సారిస్తారని పేర్కొంటున్నారు. అందుకే, కొన్ని సెషన్ల వారీగా ఈ చికిత్సను అందిస్తారని వివరిస్తున్నారు. సైకోథెరపీ ప్రత్యేకంగా మానసిక, భావోద్వేగ, ప్రవర్తనా సమస్యలతో వ్యవహరిస్తుందని అధ్యయనం పేర్కొంది. సైకోథెరపీలో ముఖ్యంగా ఒత్తిడి, ఆందోళనలు, యాంగ్జైటీ, ఆయా సంఘటనలతో షాక్‌లోకి వెళ్లిపోవడం, వివిధ రకాల భయాలతో సతమతమవడం, బైపోలార్ డిజార్డర్, ఈటింగ్ డిజార్డర్స్, కుటుంబ కలహాలు, లైంగిక పరమైన సమస్యలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు.. ఇలాంటి వాటితో



బాధపడుతోన్న బాధితుల్ని తిరిగి మామూలు స్థితికి తీసుకురావడానికి, వారిలో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఈ టాక్ థెరపీ ప్రభావవంతంగా పని చేస్తుందంటున్నారు నిపుణులు. మానసిక సమస్యను బట్టి వ్యక్తిగతంగా/బృందంగా /కుటుంబ సభ్యులకు/ దంపతులకు ఈ నాలుగు రకాల్లో ఏదో ఒక విధంగా డాక్టర్లు థెరపీ చేస్తారని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ చికిత్స వల్ల ఆయా మానసిక సమస్యల నుంచి విముక్తి పొందడంతోపాటు ఇతర ప్రయోజనాలూ కూడా ఉంటాయని చెబుతున్నారు. వ్యక్తుల మధ్య అభిజ్ఞా-ప్రవర్తనా, ఇతర రకాల టాక్ థెరపీలు అనేవి వ్యక్తులు తమ సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయని అధ్యయనం పేర్కొంది.

సైకోథెరపీ వల్ల మన ఆలోచనలు, ప్రవర్తన, భావాలను మునుపటి కంటే మరింత బాగా అర్థం చేసుకోగలుగుతామని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, మన గురించి మనం ఎక్కువగా తెలుసుకునే వీలు కలుగుతుందని, మనలోని భావోద్వేగాల్ని అదుపులో ఉంచుకునే శక్తి పెరుగుతుందని అంటున్నారు.

లైఫ్ అన్నాక ఏదో ఒక సమస్య మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. సైకోథెరపీతో ఇలాంటి సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొనే నేర్పు అలవడుతుందని పేర్కొంటున్నారు

ఈ థెరపీలో భాగంగా మన సమస్యలేంటో డాక్టర్లు, ఇతరులతో పంచుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయంటున్నారు నిపుణులు. తద్వారా భవిష్యత్తులో ఏ సమస్య ఎదురైనా ఇతరులతో పంచుకోవడం లేదా స్వయంగా పరిష్కార మార్గం వెతుక్కోగలుగుతారని చెబుతున్నారు.

అనుబంధాల్లోని సమస్యల్ని పరిష్కరించడంలోనూ ఈ సైకోథెరపీ సమర్థంగా పనిచేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ చికిత్స తీసుకున్న వారు భవిష్యత్తులో ఎదురయ్యే ఇలాంటి సమస్యల్నీ స్వయంగా పరిష్కరించుకుంటారని తెలియజేస్తున్నారు. ఫలితంగా, అనుబంధాలు మరింత దృఢమవుతాయని సూచిస్తున్నారు.

సైకోథెరపీలో భాగంగా మన ప్రత్యేకతలేంటో మనకు తెలుస్తాయి. తద్వారా ఇతరులతో పోల్చుకుంటూ మనల్ని మనం నిందించుకోకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. ఇదే క్రమంగా స్వీయ ప్రేమను పెంచుతుందని వివరిస్తున్నారు

నిద్రలేమి సమస్యల్నీ ఈ థెరపీ పరిష్కరిస్తుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

ఇలా వ్యక్తిగతంగానే కాదు, ఈ థెరపీతో పునరుత్తేజితం చెందిన వారు.. ఆఫీస్ పనుల్ని చురుగ్గా పూర్తిచేసి, ఉద్యోగ సంతృప్తి పొందుతారని, ఆరోగ్యం విషయంలోనూ శ్రద్ధ వహిస్తారని నిపుణులు తెలియజేస్తున్నారు.

అయితే ఈ ప్రయోజనాలన్నీ సొంతం కావాలంటే, థెరపీలో భాగంగా డాక్టర్లు చెప్పిన సలహాలు తు.చ. తప్పకుండా పాటించాలని నిపుణులు చెబుతున్నారు. సమస్యను బట్టి వాళ్లిచ్చిన మందులు కచ్చితంగా వాడాలని పేర్కొంటున్నారు. అప్పుడే మెరుగైన ఫలితం ఉంటుందని సలహా ఇస్తున్నారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోడీ ప్రపంచ రికార్డు.. 10 కోట్ల ఫాలోవర్లు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. 100 మిలియన్ల (10 కోట్లు) ఫాలోవర్ల మైలురాయిని దాటిన తొలి ప్రపంచ నేతగా ఆయన చరిత్రకెక్కారు. 2014లో ఇన్‌స్టాగ్రామ్‌లో చేరిన మోదీ, దశాబ్ద కాలంలో ఈ అరుదైన ఘనతను సాధించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాధినేతలతో పోలిస్తే ప్రధాని మోదీ ఫాలోవర్ల సంఖ్య అత్యధికంగా ఉంది. రెండో స్థానంలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (43.2 మిలియన్లు) కంటే మోదీకి రెట్టింపునకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. అంతేకాకుండా, తర్వాతి ఐదుగురు ప్రపంచ నేతల ఫాలోవర్ల సంఖ్యను కలిపినా కూడా మోదీ సంఖ్యను అందుకోలేకపోవడం గమనార్హం. ఈ జాబితాలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో (15 మిలియన్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా (14.4 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

దేశీయంగా కూడా ఇతర రాజకీయ నాయకుల కంటే మోదీ చాలా ముందంజలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సుమారు 16.1 మిలియన్ల ఫాలోవర్లతో రెండో స్థానంలో ఉండగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 12.6 మిలియన్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలోనూ మోదీకి భారీ ఫాలోయింగ్ ఉంది. ఎక్స్ (ట్విట్టర్)లో ఆయనకు 106.2 మిలియన్ల మంది, ఫేస్‌బుక్‌లో 54 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

సోషల్ మీడియాలోనే కాకుండా, ప్రపంచ నేతల ఆమోద రేటింగుల్లోనూ మోదీ అగ్రస్థానంలో నిలుస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఆరంభంలో అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన సర్వేలో మోదీ 67 శాతం అప్రూవల్ రేటింగ్‌తో మొదటి స్థానంలో నిలిచారు. ఇదే సర్వేలో ట్రంప్ 40 శాతం రేటింగ్‌తో 11వ స్థానంలో ఉన్నారు.

# గంధవరంలో పూర్తయిన విత్తన శుద్ధి కేంద్రం, గిడ్డంగి

## వచ్చే నెలలో ప్రాంభానికి సన్నాహాలు



**చోడవరం, పతాకం న్యూస్:** మండలంలోని గంధవరంలో జిల్లా స్థాయి విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో శిలాఫలకానికే పరిమితం కాగా, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పనులు మొదలయ్యాయి. ఏడాదిన్నర కాలంలోనే చేయడం విశేషం. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం పనులు పూర్తికావడంతో రెండు, మూడు రోజుల్లో జిల్లా విత్తనాభివృద్ధి సంస్థకు అప్పగించనున్నారు. వచ్చే నెల రెండు లేదా మూడవవారంలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడా విత్తన గిడ్డంగి లేదు. జిల్లా రైతులకు అవసరమైన విత్తనాలు విజయనగరం జిల్లాలోని గోదాము నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ నేపథ్యంలో జిల్లా రైతులకు వివిధ పంటల సాగుకు మేలైన విత్తనాలను అందజేయడానికి జిల్లాలోనే విత్తన గిడ్డంగి ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2018లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అవసరమైన ఐదు ఎకరాల భూమిని మండలంలోని గంధవరంలో గుర్తించారు. స్థల సేకరణ పూర్తయ్యే సమయానికి రాష్ట్రంలో ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఏడాది వరకు విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. 2020 జూలై 9వ తేదీన అప్పటి మంత్రులు కురసాల కన్నబాబు, ముత్తంశెట్టి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి శంకుస్థాపన చేశారు. 40 వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యం కలిగిన వీటి నిర్మాణ పనులను ఏడాదిలో పూర్తిచేసి, రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించగా టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకొన్నారు. అయితే స్థలంలో వున్న రాతి గుట్టలను తొలగిస్తేనే పనులు చేపడతామని కాంట్రాక్టర్ స్పష్టం చేశారు. గనుల శాఖ అనుమతితో రాళ్లను పగలగొట్టి, స్థలాన్ని అప్పగించడానికి రెండేళ్లు పట్టింది. పునాదులస్థాయి వరకు పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్ బిల్లు అప్‌లోడ్ చేశారు. నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో 2023 ఏప్రిల్‌లో పనులు ఆపేశారు. నాడు మంత్రులుగా వున్న బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్ పట్టించుకోకపోవడంతో వైసీపీ అధికారంలో నుంచి దిగిపోయే వరకు పునాదులకే పరిమితం అయ్యింది. ఏడాదిన్నర క్రితం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణ పనులు పునఃప్రారంభం అయ్యాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశాలతో కాంట్రాక్టర్ వేగంగా పనులు పూర్తి చేశారు. రెండు, మూడు రోజుల్లో విత్తనాభివృద్ధి సంస్థ అధికారులకు అప్పగిస్తారు. వచ్చే నెలలో శుభముహూర్తం చూసుకొని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిసింది




# సెమీస్ రేసులో నిలవాలంటే గెలవాల్సిందే

# జింబాబ్వేతో టీమిండియా కీలక పోరు




టి20 ప్రపంచకప్‌లో టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. గ్రూప్ దశలో దుమ్మురేపిన సూర్యకుమార్ సేన.. కీలక సూపర్-8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 188పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 111పరుగులకే కుప్పకూలింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా విఫలం కావడం అభిమానులను కలచివేస్తోంది. 200కు పైగా పరుగులను సునాయాసంగా ఛేదించే టీమిండియా.. దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. దీంతో జింబాబ్వే, వెస్టిండీస్‌తో జరగబోయే మ్యాచుల్లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఉంది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో భారత్, జింబాబ్వే జట్ల మధ్య గురువారం జరగనున్న పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. దీంతో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఇక టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ బుధవారం మాట్లాడుతూ... తొలి సూపర్-8 మ్యాచ్‌లో ఓటమితో జట్టు కూర్పులో మార్పులు చోటు చేసుకునే అవకాశమున్నట్లు సూచన ప్రాయంగా తెలియజేశాడు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్‌లలో ఒకరికి మాత్రమే తుది జట్టులో చోటు లభిస్తుందన్నాడు.

లీగ్ దశలో అభిషేక్ శర్మ-ఇషాన్ జోడీ అద్భుతంగా రాణించిందని, తిలక్ వర్మ బ్యాటింగ్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో అతడు చక్కగా ఆడాడని తెలిపాడు. మరోవైపు అభిషేక్ శర్మ ఫామ్ గురించి కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి మ్యాచ్‌లో ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలన్న అంశం మీదే ప్రస్తుతం దృష్టి సారించామని తెలిపాడు. ఇక జింబాబ్వే జట్టు విషయానికొస్తే.. ఆ జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. లీగ్ దశలో మాజీ ఛాంపియన్స్ ఆస్ట్రేలియా, శ్రీలంకలను ఓడించి గ్రూప్ టాపర్‌గా నిలిచి సూపర్-8కు చేరింది.

కానీ సూపర్-8 తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో చిత్తుగా ఓడింది. ఈ క్రమంలో నేడు జరిగే మ్యాచ్‌లో ఓడిన జట్టు సెమీస్ రేసు నుంచి నిష్క్రమించినట్లే. భారత్-జింబాబ్వే జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు ముందు అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు సెమీస్ బెర్త్ ఖాయం కానుంది. ఈ రెండు జట్లు తమ తమ తొలి సూపర్-8 మ్యాచ్‌లో భారీ విజయాలను నమోదు చేసుకొన్నాయి. దీంతో ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు గ్రూప్-1 నుంచి సెమీస్‌కు చేరనుంది.

# వెస్టిండీస్‌పై సౌతాఫ్రికా ఘన విజయం



టీ20 ప్రపంచ కప్ 2026 సూపర్ 8లో భాగంగా నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 177 పరుగుల లక్ష్యాన్ని ప్రొటీస్.. 1 వికెట్ కోల్పోయి 16.1 ఓవర్లలోనే ఛేదించింది. కెప్టెన్ ఐడెన్ మార్క్‌రమ్ (82) హాఫ్ సెంచరీతో చెలరేగారు. ఓపెనర్ క్వింటన్ డికాక్(47) రాణించారు. ర్యాన్ రికెల్టన్(45) అజేయంగా నిలిచాడు. దీంతో సౌతాఫ్రికా రెండు విజయాలు నమోదు చేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. సఫారీ బ్యాటర్లను ఔట్ చేయడానికి విండీస్ బౌలర్లు తీవ్రంగా చెమటోడ్చారు. రోస్టన్ ఛేజ్ మాత్రమే వికెట్ పడగొట్టగలిగాడు. మిగతా బౌలర్లంతా ధాటిగా పరుగులు సమర్పించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగుల చేసింది. షెఫర్డ్(52) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. హోల్డర్(49) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. సఫారీ బౌలర్లలో ఎంగిడి 3, రబాడా, బోష్ తలో 2 వికెట్లు పడగొట్టారు.




# నేడు 'విష్ణు విన్యాసం' రిలీజ్



విలక్షణ నటుడు శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విష్ణు విన్యాసం'. యదునాథ్ మారుతిరావు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రన్ టైమ్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా నిడివి కేవలం 1 గంట 59 నిమిషాలు మాత్రమే ఉండనుందని శ్రీవిష్ణు స్వయంగా వెల్లడించారు. నిడివి తక్కువగా ఉన్నప్పటికీ, వినోదం మాత్రం ఫుల్ మీల్స్ రేంజ్‌లో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ విషయంపై గురువారం తన ఎక్స్ ఖాతాలో శ్రీవిష్ణు ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. ''లాంగ్త్ కొంచెం డైట్‌లో ఉంది... కానీ ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రం ఫుల్ మీల్స్ విత్ ఎక్స్‌ట్రా డెజర్ట్. ఇది నా ప్రామిస్. శుక్రవారం ఫ్యామిలీతో రండి, ఎంజాయ్ చేసి, థియేటర్లలో మళ్లీ మళ్లీ రిపీట్ కొట్టండి!" అంటూ ప్రేక్షకులలో అంచనాలను పెంచారు. ఈ చిత్రం ఫిబ్రవరి 27న థియేటర్లలోకి రానుంది.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు.జి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, హేమ, శాలిని సమర్పిస్తున్నారు. సాయికృష్ణ బొబ్బ, రామాచారి.ఎం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ యానిమేటెడ్ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంది. "నో బ్రేక్స్ - జస్ట్ లాఫ్స్" అనే ట్యాగ్‌లైన్‌తో, అర్బన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథ పూర్తిస్థాయి వినోదాత్మకంగా ఉండనుందని స్పష్టమవుతోంది.

ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటించగా... సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. రాధన్ సంగీతం అందించగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూశారు.

### ఉదయ్‌పూర్‌లో ఘనంగా

# విజయ్, రష్మిక వివాహం



టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఎట్టకేలకు ఒక్కటయ్యారు. తమ రిలేషన్‌షిప్‌పై కొన్నేళ్లుగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ఇవాళ ఉదయం 10:10 గంటలకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరిగింది. విజయ్, రష్మిక మెడలో మూడు ముళ్లు వేసి ఆమెను తన జీవిత భాగస్వామిగా స్వీకరించారు.

ఈ వివాహ వేడుక రెండు విభిన్న సంస్కృతుల కలయికగా అత్యంత వైభవంగా జరుగుతోంది. ఉదయం విజయ్ కుటుంబ పద్ధతిలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి తంతు పూర్తికాగా, గురువారం సాయంత్రం 4:30 గంటలకు రష్మిక కుటుంబ ఆచారాల ప్రకారం మరోసారి వివాహం నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లికి ముందు జరిగిన వేడుకలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. హల్దీ వేడుక ఫొటోలను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా, అభిమానులు పెద్ద ఎత్తున స్పందించారు. అంతకుముందు 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ సైతం వైరల్‌గా మారింది. తమ అభిమాన జంట పెళ్లి చేసుకోవడంతో 'విరోష్' హ్యాష్‌ట్యాగ్‌తో నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఉదయ్‌పూర్‌లో వివాహం చేసుకున్న ఈ జంట, మార్చి 4న హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీస్థాయిలో వెడ్డింగ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.




# ఆగస్టు 28న 'భోగి'



శర్వానంద్ నటిస్తున్న 'భోగి' చిత్రం నుండి కీలక అప్‌డేట్ ఒకటి బయటికి వచ్చింది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా నుండి శర్వా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. విడుదల తేదీని కూడా ప్రకటించారు. ఈ సినిమాను ఆగస్టు 28న థియేటర్లకు తీసుకు వస్తున్నట్లు తెలిపారు. సంపత్ నంది దర్శకత్వంలో... 1960 నాటి కథా నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో శర్వా ఇదివరకు ఎప్పుడూ కనిపించని పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. అనుపమా పరమేశ్వరన్, డింపుల్ హయతి ఈ సినిమాలో కథానాయికలుగా నటిస్తున్నారు. భీమ్స్ సంగీతం అందిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**